నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 4 డిసెంబర్ 2024 | RANGAREDDY



హైదరాబాద్-బీజాపూర్ రహదారి


మహిళలను అరెస్టు చేస్తున్న పోలీసులు

# పొలాల మధ్య డంపింగ్‌యార్డు వద్దు..

## పరిగి మండలంలోని రంగాపూర్ రైతుల ఆందోళన

- పలువురు మహిళలను అరెస్టు చేసిన పోలీసులు
- భారీ బందోబస్తు మధ్య శంకుస్థాపనకు ఏర్పాట్లు
- అధికారులతో శంకుస్థాపన కానిచ్చిన సర్కారు

*పచ్చటి పంట పొలాల మధ్య డంపింగ్‌యార్డు వద్దంటూ మండలంలోని రంగాపూర్ గ్రామ రైతులు ఆందోళన నిర్వహించారు. మాజీ ఎంపీపీ అరవిందరావు, మాదారం మాజీ సర్పంచ్ రాములు, పలువురు రైతులు మట్టి రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. పోలీసులు అడ్డుకునేందుకు రావడంతో పరిగి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను తమ గ్రామంలోని పచ్చని పంట పొలాల మధ్య ఎందుకు వేస్తారని.. సమీపంలో ఆలయాలు సైతం ఉన్నాయంటూ వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురు మహిళా రైతులను అరెస్టు చేసిన పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో డంపింగ్ యార్డు శంకుస్థాపనకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రావాల్సి ఉన్నది. కానీ ఆయన రాకపోవడంతో అధికారులు హడావుడిగా శంకుస్థాపన చేశారు.*

*- పరిగి, డిసెంబర్ 3*



### భారీ బందోబస్తు మధ్య అధికారులతో శంకుస్థాపన..

రైతులు తీవ్ర ఆందోళన చేస్తుండడంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యలతో డంపింగ్ యార్డు శిలాఫలకానికి శంకుస్థాపన చేయించారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే ఒక ఎస్ఐ, నలుగురు లేదా ఐదుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. కానీ డంపింగ్‌యార్డు శంకుస్థాపన కోసం మాత్రం ఏకంగా డీఎస్పీ, సీఐ, పలువురు ఎస్ఐలు, అధిక సంఖ్యలో కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించడం గమనార్హం.

### నిధుల కేటాయింపు..

డంపింగ్ యార్డు ప్రహరీ, ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం కోసం 15వ ఆర్థిక సంఘం కింద రూ.25 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. డంపింగ్‌యార్డులో సెగ్రిగేషన్ షెడ్డు, కంపోస్టు ఎరువుల తయారీకి మరో రూ.50 లక్షల నిధులను మంజూరు చేయనున్నట్లు తెలిసింది.

### రోగాలబారిన పడుతం..



గ్రామాల మధ్య డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తే రోగాలబారిన పడుతాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నిస్తే వద్దని చెప్పడంతో విరమించుకున్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకంగా శంకుస్థాపన చేయడం సరికాదు.

– బాల్‌రాజ్, రంగాపూర్

### డంపింగ్ యార్డు ఏర్పాటు ఇలా..

పరిగి మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు లేదు. దీంతో రంగాపూర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 50లో 2.26 ఎకరాలు, మాదారం గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 288లో 0.14 ఎకరాలు కలిపి మొత్తం మూడు ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు సెప్టెంబర్ 28న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థలం రంగాపూర్, మాదారం, నజీరాబాద్‌తండాల మధ్య ఉంటుంది. దీంతో పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసి గ్రామాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని విన్నవించినా శంకుస్థాపన చేయించడం గమనార్హం.


అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

### ప్రజలు వద్దంటే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు..

**- కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

మూడు గ్రామాల ప్రజలు డంపింగ్‌యార్డు వద్దని వ్యతిరేకిస్తుంటే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఆయన ఘటనా స్థలానికి వెళ్లి తహసీల్దార్ ఆనంద్‌రావుతో మాట్లాడారు. గతంలో ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని ఆలోచించగా రైతులు వ్యతిరేకించడంతో శాఖాపూర్ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి, కొంత మేర పనులు సైతం చేపట్టామన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా మళ్లీ ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని తహసీల్దార్‌ను నిలదీశారు.

# అధ్వాన దారులు.. రుధిర ధారలు

## హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు

- ఏడాదిన్నర క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినా షురూ కాని రోడ్డు విస్తరణ పనులు
- బలవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆలూర్ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ (ఫైల్)


మీర్జాగూడ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)

*అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిలో మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. రోడ్డు చిన్నగా ఉండి మూలమలుపులు అధికంగా ఉండడంతో వారంలో దాదాపుగా రెండు వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఏడాదిన్నర క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తైనా.. రేవంత్ సర్కారు నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంతో ఆ దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు జంకుతున్నారు.*

*- చేవెళ్ల రూరల్, డిసెంబర్ 3*

### డేంజర్ మలుపులు..

హైదరాబాద్–బీజాపూర్ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. అసలే అది చిన్న రోడ్డు.. అందులో మూలమలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుమీదుగా రంగారెడ్డి, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలతోపాటు పక్క రాష్ట్రంలోని కర్ణాటకకు కూడా అనేక బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. హెవీ వెహికిల్స్ వెళ్లడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిని గతుకులమయంగా మారింది.

### ముందుకు సాగని పనులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనా హైదరాబాద్ –బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఈ రోడ్డు విస్తరణ కోసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైంది. సీఎం, స్పీకర్ ఇద్దరూ వికారాబాద్ జిల్లాకు చెందిన వారే ఉన్నా .. పనులు ప్రారంభం అయ్యేందుకు చొరవ చూపకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్పందించి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి రోడ్డు ప్రమాదాల నుంచి తమను కాపాడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### సీఎం సొంత నియోజకవర్గానికి వెళ్లే దారి..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌కు ఈ రోడ్డు మార్గం గుండానే వెళ్లాలి. ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నా సీఎం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొంత సెగ్మెంట్‌కు వెళ్లే రోడ్డును బాగుచేయలేని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రజలు, బాధితులు ప్రశ్నిస్తున్నారు.

### 24 గంటలు గడవక ముందే..

ఈనెల 1వ తేదీ (ఆదివారం) శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దటూరుకు చెందిన మేకల లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు బంధువుల ఇంటికి వెళ్లొస్తుండగా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గేట్ సమీపంలో కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మరువక ముందే సోమవారం మరో రెండు భారీ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆలూర్ గేట్ సమీపంలో కూరగాయల వ్యాపారులపైకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జరిగిన 2 గంటల్లోనే చేవెళ్ల మండలంలోని అంతారం గేట్ సమీపంలో ఎదురెదురుగా స్కూటీ డీసీఎం వ్యాన్ ఢీ కొన్న ఘటనలో స్కూటీ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు.

### విరిగిపోయిన ప్లాస్టిక్ రోడ్డు డివైడర్లు..

మూల మలుపుల వద్ద ప్లాస్టిక్ రోడ్డు డివైడర్లు పూర్తిగా విరిగిపోవడంతో అతివేగంతో వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా బ్లాక్ స్పాట్లలో డివైడర్లు, హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళ్లే రోడ్డులో ప్లాస్టిక్ రోడ్డు డివైడర్లు పూర్తిగా విరిగిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వాటిని తిరిగి ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి

### మన ప్రాణాల కన్నా చెట్లు ముఖ్యం కాదు..

**హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలి**

**బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి**

చేవెళ్ల టౌన్, డిసెంబర్ 3 : హైదరాబాద్–బీజాపూర్ రహదారిలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిం చి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..? అని మండిపడ్డారు. మనుషుల ప్రాణాల కన్నా చెట్లు ముఖ్యం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు విస్తరణ పనులను చేపట్టి ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏ గేటు వద్ద ఉన్న చెట్లను ఆ గ్రామానికి చెందిన వారే నరికి వేస్తారని.. అధికారులు ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమన్నారు.

# రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించాలి..

- బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్
- ఆలూర్ గేట్ నుంచి చేవెళ్ల వరకు గ్రామస్తులతో కలిసి పాదయాత్ర

షాబాద్ : బీజాపూర్–హైదరాబాద్ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలకు నిరసన గా మంగళవారం చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామస్తులు, అఖిలపక్ష నాయకుల తో కలిసి ఆయన ఆలూర్ గేట్ నుంచి చేవెళ్ల వరకు పాదయాత్రగా వెళ్తున్న క్రమంలో మీర్జాగూడ సమీపంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, ఏసీపీ కిషన్ తదితరులు కలిసి వారిని ఆపి చర్చించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ఎక్స్‌గ్రేషియా కింద రూ.7 లక్షలు, గాయపడ్డ వారికి ప్రభుత్వం తరపున వైద్య ఖర్చులు భరించి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్ మా ట్లాడుతూ..బీజాపూర్–హైదరాబాద్ రోడ్డు విస్తరణ పనులు తక్షణమే ప్రారంభించా లన్నారు. ఎన్‌జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)గతేడాదే ఇచ్చిన ఆదేశాలను ఈ ప్రభు త్వం నిర్లక్ష్యం చేయడంతోనే రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగక.. ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమం లో అఖిలపక్ష నాయకులు, గ్రామాల ప్రజలు తదితరులున్నారు.


ఆలూర్ గేట్ నుంచి చేవెళ్ల వరకు గ్రామస్తులతో కలిసి పాదయాత్రగా వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఏది ?
- బస్తీ దవాఖానల్లో డాక్టర్లు లేరు.. మందులూ లేవు
- ప్రజల దాహార్తిని తీర్చింది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరే
- మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా
- ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి


బడంగ్‌పేట, డిసెంబర్ 3 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని ప్రజలకిచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడం లేదని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ప్రశ్నించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇచ్చిన వారందరికీ తులం బంగారం ఇచ్చే వరకు కాంగ్రెస్ నేతలను నిలదీయాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన రిజర్వాయర్లను నేడు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని.. కొత్తగా జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు.

### ప్రజల దాహార్తిని తీర్చింది.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరే..

భవిష్యత్‌లో నీటి సమస్య రాకుండా ఉండడానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సమస్య లేకుండా చేశారని ఎమ్మెల్యే సబితారెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ శివారు పరిధిలో ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, ఉప్పల్ నియోజకవర్గాల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించడానికి రూ.1200 కోట్లు, మహేశ్వరం నియోజకవర్గానికి రూ.260 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

### మెరుగైన వైద్యం కోసమే బస్తీ దవాఖానల ఏర్పాటు..

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి బస్తీ దవాఖానలను కేసీఆర్ ఏర్పాటు చేయించారన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 13 బస్తీ దవాఖానలు, 9 అర్బన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానల్లో డాక్టర్లు లేరని, మందుల కొరత ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.


జల్‌పల్లిలో షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి


షాద్‌నగర్ చటాన్‌పల్లిలో బాలుర గురుకుల పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

## విద్యా శాఖకు మంత్రి లేడు.. విద్యార్థులను పట్టించుకునే నాథుడూ లేడు..

- ఏడాది కాలంలో 50 మంది విద్యార్థులు మృతి
- అధ్వానంగా షాద్‌నగర్ గురుకులం
- భోజనంలో ప్లాస్టిక్ కవర్లు, రాళ్లు
- మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులు లేవు
- షాద్‌నగర్ చటాన్‌పల్లిలో బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించిన బీఆర్‌ఎస్వీ బృందం
- పాఠశాల లోనికి వెళ్లకుండా ప్రధాన ద్వారానికి తాళం
- సమస్యలను చెప్పొద్దంటూ విద్యార్థులకు బెదిరింపులు

# గురుకులం..సమస్యలమయం

షాద్‌నగర్, డిసెంబర్ 3 : గురుకుల పాఠశాలల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్‌ఎస్వీ బృందం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లిలోని గురుకుల పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన వారిని అక్కడి సిబ్బంది అడ్డుకోగా, పాఠశాల ఎదుటే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖకు మంత్రి లేడని, విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. చాటాన్‌పల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో కొంత మంది విద్యార్థులను ఎలుకలు కరువగా, అనారోగ్యానికి గురై ఓ విద్యార్థి మృతి చెందాడని తెలిపారు. విద్యార్థులకు వడ్డించే భోజనంలో ప్లాస్టిక్ కవర్లు, రాళ్లు వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గురుకులంలో సరిపడా మరుగు దొడ్లు లేవని, ఉన్న మరుగుదొడ్లకు, స్నానపు గదులకు తలుపులు లేవన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వస్తే పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రధాన ద్వారానికి తాళం వేసి, ఏమీ చెప్పవద్దంటూ విద్యార్థులను బెదిరించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కలుషిత ఆహారం తిని, ఇతర వేధింపులతో సుమారు 50 మంది గురుకుల విద్యార్థులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను చెప్పేందుకు పాఠశాల సిబ్బంది వెనుకాడుతున్నారని అన్నారు. గత 11 నెలలుగా భవనానికి అద్దె ఇవ్వడం లేదని, మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. గురుకుల పాఠశాల ముందు నిరసన తెలిపిన టీఆర్‌ఎస్వీ నాయకులను షాద్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ ఉస్మానియా విశ్వవిద్యాలయ నాయకుడు చిటారి దశరథ్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శీలం శ్రీకాంత్, గుండు అశోక్, శరత్‌కృష్ణ, రాజశేఖర్, హనుమంతు, శ్రీనివాస్, సత్యం, శేఖర్, సంజూనాయక్, ప్రవీణ్, నవీన్, దారమోని సాయియాదవ్, సాయితేజ, శివనాయక్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

